# నేను

# నా

# Ph.D.

# ?

యస్. శ్రీధర్

This story and characters are fictitious. Any resemblance to persons living or dead is coincidental. The opinions expressed are those of the characters and should not be confused with the author.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | చిన్నప్పటి జ్ఞాపకాలు | 01 |
| 2. | కాలేజి విషయాలు | 04 |
| 3. | పిహెచ్.డి.లో మొదటవ సంవత్సరం | 12 |
| 4. | రెండవ సంవత్సరం | 16 |
| 5. | మూడవ సంవత్సరం | 26 |
| 6. | ఆపత్బాంధవుడు | 30 |
| 7. | నాల్గవ సంవత్సరం | 33 |
| 8. | ఐదవ సంవత్సరం | 36 |
| | నా మాట | 40 |

# 1. చిన్నప్పటి జ్ఞాపకాలు

మనము పుట్టినప్పటి నుండి గిట్టే వరకు మన జీవితంలో ప్రతి విషయాన్ని పరీక్షించుకోవడం సర్వ సాధారణమైపోయింది. తల్లిదండ్రులు పిల్లల ముందు వివిధ వృత్తులకు సంబంధించిన వస్తువులను నేల మీద పరిచి ఆ పాప/బాబును వదిలేస్తే వారు ఏ వస్తువు పట్టుకుంటే అది అవుతారని అనుకోవడం. వారు అనుకున్నది పట్టుకుంటే సంతోషపడటం లేక పోతే బాధ పడటం. మరికొంత మంది ఇది ఒక సరదా లాగ భావిస్తారు. ఇలాగ చిన్నప్పుడు ఏ వస్తువు పట్టుకున్నారో వారు పెద్దయ్యాక అదే వృత్తిలో పనిచేస్తున్నార లేక వేరే వృత్తిలో ఉద్యోగం చేస్తున్నారో నాకు తెలియదు. యవ్వనము వచ్చిన తరువాత మనము చేస్తున్న పని మీద అవగాహన ఉన్నప్పుడు. ఆ పనిని నేను చేయగలనా/చేయలేనా అన్న విషయం మనకు పూర్తిగా అర్థమైపోతుంది. అలా అర్థమైపోయిన తరువాత కూడా

మనము వ్యతిరేకంగా వెల్తున్నామంటే అది మన మూర్ఖత్వమనే భావించాలి. అలాంటి కథే ఈ "నేను నా పిహెచ్.డి".

వేసవి సెలవులకు మా పెద్దమ్మ వారింటికి వెళ్ళి అక్కడ కొన్ని రోజులు ఉండటం. ఆ తరువాత ఇంటికి తిరిగి వచ్చేసి అక్కడ  ఉన్న స్నేహితులతో ఆడుకోవడం అలా చిన్నప్పుడు వేసవి సెలవులు చాలా సరదాగా గడిచిపోయేవి. మనం చిన్నప్పుడు ఉన్నంత సంతోషంగా, ఆనందంగా మన జీవితంలో మరెప్పుడూ ఉండలేము అని అనిపిస్తుంది. ఇలా ఎంతమందికి అనిపిస్తుందో నాకు తెలియదు.  ఈ జీవితంలో అన్నింటి కంటే గొప్పనైంది సమయము అని నేను భావిస్తాను. ఎందుకంటే గడిచిన సమయము మరెప్పటికీ వెనక్కిరాదు. అందుకేనేమో పెద్దవారు సమయాన్ని వృధా చేయొద్దు అని చాలా సార్లు చెప్పడము విన్నాను. కాని ఎప్పుడూ కూడా నేను వారు చెప్పినట్టు నడుచుకోలేదు. స్కూల్లో నాకు మంచి

మార్కులు వచ్చేవి అది చూసి నా మేనమామ నన్ను పొగిడేవారు. నేను పదవ తరగతి కష్టపడి చదవలేదు అలాగని ఇష్టపడికూడా చదవలేదు. అదికాక అర్థంచేసుకొని కూడా చదవలేదు. చదివినది గుర్తు పెట్టుకోవడానికి చాలా మంది చెప్పుకుంటూ వ్రాయి అని అంటుంటారు.

ఆ అలవాటు నాకు చిన్నప్పుడూ ఉండేది కాదు. కానీ చదవడానికి కూర్చుంటే మాత్రం అలా కూర్చుండి పోయేవాన్ని చూసే వారికి నేనెప్పుడూ చదువుతుంటానని అనిపించేది కానీ నిజానికి, ఒక్క లైన్ ఒక గంట చదివేవాన్ని. ఏకాగ్రత అంతగా ఉండేది కాదు చదివినది మెదడులో ఎక్కువ కాలం ఉండేది కాదు. అలా అని జ్ఞాపక శక్తి లేదనుకుంటే చిన్నప్పటి నుండి నేను చేసిన తప్పులు, నాకు జరిగిన చిన్న చిన్న అవమానాలు అలాగే గుర్తుండి పోతాయి. అంటే నెగటివ్ ఏదైన నా లైఫ్లో జరిగితే నేను మరవనన్న మాట.

***

## 2. కాలేజి విషయాలు

ఇంటర్మీడియేట్ నాలుగు సంవత్సరాలు చదివినా. అప్పటితో చదువు ఆపకుండా నలుగురిలో నారాయణ అన్నట్టు నేను కూడా చదువు అంతటితో ఆపలేదు.. పదవ తరగతిలో ఏదో ఒకటి వ్రాసినందుకు డెబ్బై శాతం మార్కులు వచ్చినందుకు. ఇంటర్మీడియేట్లో ఎం.పి.సి. సీటు వచ్చింది నాన్నగారు మంచిగా చదువు చెప్పే చోట చేర్పిస్తే నేను ఒక ఐదు రోజులు వారు ఎలా చెబుతున్నారో చూసి ఆ తరువాత నిర్ణయించుకుంటానని చెప్పి పది రోజులు ఫీసు కట్టకుండా రోజు కాలేజికి వెళ్ళివచ్చా. అది ప్రైవేటు కాలేజి కావడంతో గవర్నమెంట్ కాలేజి కంటే ముందుగానే ప్రారంభించారు. ఆ ప్రైవేటు కాలేజిలో చదువు చాలా బాగా చెప్పేవారు నేను కాస్త శ్రద్ధ పెట్టి చదివింటే మంచి మార్కులతో ఉత్తీర్ణుడైయేవాన్ని. కాని నేను కొవ్వుపట్టి ఆ కాలేజి మానేసి గవర్నమెంట్ కాలేజిలో చేరాను ఇక్కడ ఎవరు

పాఠాలు వింటున్నారు అని అంతగా గమనించరు కాని ఎంత మంది హాజరు అవుతున్నారని గమనించేవాళ్ళు. అందుకు నేను ఫస్ట్ అవర్లో అటెండెన్స్ తీసుకున్న తరువాత సినిమాకు వెల్లేవాడిని ఆ సమయంలో పవన్ కల్యాణ్ గారి సినిమా తొలిప్రేమ విడుదలైంది, ఆ సినిమాని పద్నాల్గుసార్లు చూశాను. అలా ఒకటి తరువాత ఇంకొక సినిమా అన్నట్టు కాలం గడిచిపోయింది. ఫిసిక్స్ మరియు కెమిస్ట్రి ల్యాబ్లకు తప్పకుండా హాజరు అయ్యేవాన్ని. సబ్జెక్ట్ మీద ఇష్టముండి కాదు. అటెండెన్స్ తక్కువుంటే ఫేల్ చేస్తారని. అటెండెన్స్ ఉంటే చివరి పరీక్షలో ఏమీ చేయకున్నా పాస్ చేస్తారని తెలిసింది, అందుకే అలా చేశాను. ఫిసిక్స్ ల్యాబ్ సరదాగా గడిచిపోయేది కాని కెమిస్ట్రి ల్యాబ్ నాకు ఒక పెద్ద సూపర్ మార్కెట్లో పప్పు దినుసులు మరియు మసాలా సెక్షన్లో ఉన్నట్టు అనిపించేది. సూపర్ మార్కెట్లో విచిత్రమైన వాసనలు ఉండవు అదే కెమిస్ట్రీ

ల్యాబ్లో ఇవన్నీ జరుగుతాయి. ఆ ల్యాబ్ మాన్యువల్ ప్రకారం ఏమి చేయాలో వ్రాసుంటుంది అది నోట్ బుక్లో వ్రాసుకొని వెళ్ళేవాళ్ళం. అక్కడ నాకు ఎలా ఉండేదంటే ఎప్పుడూ వంటగదికి వెల్లని పెళ్ళికూతురు అత్తారింట్లో మొదటిసారి పక్కవాళ్ళని అడిగి వారితో పాటు వంట చేయడం లాగ ఉండేది. బ్యురేట్, పిప్పేట్, కొనికల్ ఫ్లాస్క్, స్టిర్రర్ ఇలా ఏవేవో ఉండేవి. నాకు కలర్ బ్లైండ్నెస్ ఉందని నాకు అప్పట్లో తెలియదు. బ్రౌన్, బ్లాక్, రెడ్, గ్రీన్, ఎల్లో రంగులకు తేడా ఎవరైనా చెబితే గాని తెలిసేదికాదు. ఎందుకంటే లైట్ కలర్లుంటే అస్సలు అర్థమైయ్యేది కాదు డార్క్ కలర్ ఉంటే డౌట్ ఉండేది. అందుకు ఏది కలిపితే ఏ రంగు వస్తుందని పేపర్ మీద రాసుకొని అదే రంగు వచ్చింది అని వ్రాసేవాన్ని. దేవుని దయవల్ల చేతికి, ముఖానికి, కాళ్ళకు ఏమీ కాలేదు. కరెక్ట్ గా పాస్ మార్కులు వేశారు. ఫేల్ అయితే నా కష్టము ఆ భగవంతునికే తెలుసు. ఇంకొక విచిత్రమేమంటే

కెమిస్ట్రీ ల్యాబ్లో ఏ ఎక్స్పరిమెంట్ సులభము ఏది కష్టమో కూడా నాకు అర్థమైయేది కాదు. ఎవరైనా చెబితే అవునా అని వారితో పాటు ఆశ్చర్యపోవడం అంతే. రెండు సంవత్సరాలు థీరీ సబ్జెక్ట్కు ట్యూషన్ కు వెళ్ళే వాన్ని. సినిమాలకు వెళ్ళి, ఆ తరువాత ట్యూషన్ ఫీసులకు నాన్న డబ్బులను అనౌసరంగా ఖర్చు పెట్టించా.

జీవితంలో చిన్నా చిటుకా కాపీలు కొట్టాను అది ఎలా అంటే ఎరేసర్ మీద పెన్సిల్తో ఫార్ములాలు వ్రాసుకోవడం, మెటల్ జామెట్రి బాక్స్ లోపల పెన్సిల్తో వ్రాసిపెట్టుకోవడం. పేపరు ఇచ్చిన వెంటనే ఎరేసర్ మీద ఉన్నదీ మరియు మెటల్ జామెట్రి బాక్స్ లోపల వ్రాసి ఉన్నవి, పేపర్ చివర్లో వ్రాసే వాడిని. వ్రాసిన వెంటనే ఎరేసర్ మరియు బాక్స్ లోపటివి తురిపేసే వాడిని. ఈ పద్ధతి ఎం.టెక్. పూర్తయ్యే వరకు చేశాను. కాని ఎం.టెక్.లో బాక్సు తీసుకొని పోయేవాళ్ళము కాదు కాబట్టి ఎరేసర్ మీద

మరియు చేతి మీద మరియు మోకాళ్ళ కింద భాగంలో పెన్ తో వ్రాసుకునే వాడిని. ఇలా నా చదువు పదవ తరగతి నుండి ఎం.టెక్. పూర్తయ్యే వరకు పది సంవత్సరాలు పట్టింది. నా చదువు ఎలా సాగిండంటే పదవ తరగతి 1 సం., ఇంటర్-4 సం., పాలిటెక్నిక్-3 సం., బి.టెక్.-3 సం. (లేటరల్ ఎంట్రీ పద్ధతి)., ఎం.టెక్.-2 సం., పిహెచ్.డి.-5 సం.

ఇంటర్మీడియేట్ లో ఇంగ్లీష్ పరీక్ష వ్రాయడానికి వెళ్ళాను, అది క్లాస్ టెస్ట్. ఇంగ్లీష్ టెక్స్ట బుక్కు నాకింద పెట్టుకొని ఇన్విజిలేటర్ చూడని సమయంలో టెక్స్ట బుక్ చూసి కాపీ కొట్టాను. ఓ అరగంటలో నన్ను ఇన్విజిలేటర్ పట్టుకొని బయటకు పంపించేశాడు. మంచివాడు పాపం నన్ను కొట్టలేదు-తిట్టలేదు. అది ఇప్పుడు తలచుకుంటే నేను అంతలా దిగజారి పోయానా అని అనిపిస్తుంది. మరీ టెక్స్ట బుక్ పెట్టివ్రాయడమా? తలచుకుంటే నవ్వు మరియు కోపం రెండూ

వస్తున్నాయి. నేను మరీ అంత మూర్ఖుడినా అని ఇప్పుడు అనిపిస్తుంది. ఇంటర్మీడియేట్లో నేను ఫిసిక్స్ కెమిస్ట్రి రెండు మూడు ప్రయత్నాల్లో పాస్ అయిపోయా. కాని మ్యాథ్స్-2బి లో మూడు ప్రయత్నాలు సరిపోలేదు. ఆ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ మరియు ఇంటెగ్రల్స్ రాక పోవడం వళ్ళ పాస్ మార్కులకు ఓ ఐదు మార్కులు తక్కువ వచ్చి ఫెయిల్ అయ్యేవాన్ని.

మా చిన్నాన్న ఒక గవర్నమెంట్ మ్యాథ్స్ లెక్చరర్ దగ్గర నా విషయం చెప్పారు. అప్పుడు ఫైనల్ పరీక్షలకు కేవలం ఒక నెల మాత్రమే ఉంది. ఆయన మొత్తం మ్యాథ్స్-2బి ఒక్క నెలలో చెప్పినా బుర్రకెక్కదు అని చెప్పారు. నీకు ఏది కావలో ఎంచుకో అన్నారు. కోఆర్డినేట్ జామెట్రి నాకు కాస్త అర్థమైయ్యేది కాని అదొక్కటి వళ్ళ నేను పాస్ కావడం కష్టం. నేను నా పరిస్థితి ఆయనకు వివరించాను. ఆయన డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ మరియు ఇంటెగ్రల్స్ నేర్చుకో అప్పుడు అందులోనూ మరియు

ఇందులోను మార్కులు సంపాదిస్తే పాస్ అయిపోతావు అన్నారు. ఇక నేను ఒక తెల్లటి కొత్త పుస్తకాన్ని కొనుక్కొని మొదటి రోజు వెళ్ళా. చెట్టు కింద బండమీద చాపవేసి ఉదయం పది నుండి పదకొండు వరకు చెప్పేవారు. ఆయన చెప్పినది చెప్పినట్టు ఇంటికెళ్లి చేసి చేసి ఆఖరికి ఫైనల్ పరీక్షలలో డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ మరియు ఇంటెగ్రల్స్ లోనే ఎక్కువగా మార్కులకు అట్టెంప్ట్ చేసి మొత్తానికి పాస్ కావడమే కాక, డెబ్బై శాతం మార్కులు తెచ్చుకున్న. నా జీవితంలో అంత బాగా పట్టుదలతో-పూర్తి ఏకాగ్రతతో మరెప్పుడూ చదవలేదు. అప్పటి నుండి మళ్ళీ చదువు మీద మక్కువ మొదలైంది. ఇక పాలిటెక్నిక్ లో ఎనభై శాతం తెచ్చుకున్నానుబి.టెక్. లో మరియు ఎం.టెక్. లో డెబ్బై ఐదు శాతం మార్కులు వచ్చాయి.

నాన్నగారు వారి తల్లిదండ్రులకు డబ్బు పంపిస్తూ మాకు ఖర్చుపెడుతూ. నా చదువుకి ఖర్చు పెట్టి చాలా కష్టపడ్డారు.

నాకు ఎప్పటికి కష్టమనేది తెలియకుండానే పెంచారు. నేను చేసిన తప్పుకి ఇప్పుడు బాధ పడుతున్నాను.

***

## 3. పిహెచ్.డి. లో మొదటవ సంవత్సరం

నా మేనమామ వారు కోటీశ్వరులు. భార్యా-భర్తలు గవర్నమెంట్ ఉద్యోగం చేశారు కాబట్టి బాగానే సంపాదించుకున్నారు. అలాగే వీరి తాతగారి ఆస్తులు, పొలాలుకూడా రావడంతో. ఇవ్వన్నీ అమ్మేసి విశాఖపట్నంలో రెండు డూప్లెక్స్ ఇళ్ళులు కొన్నారు. ఒక అపార్ట్మెంట్లో ఇళ్ళు తరువాత పట్టణానికి బయట నాలుగు బాగా ఖరీదైన స్థలాలు వీరి పేరున ఉన్నాయి. వీరికి ఒకటే కూతురు. మాకు విశాఖపట్నంలో రెండు అపార్ట్మెంట్లు వాటికి కిరాయి మొత్తం రెండు లక్షల వరకు వస్తుంది. మాకు ఏ వ్యాపారాలు లేవు. నేను నా అమ్మా నాన్నకు ఒక్కడే కొడుకు. మా అత్తకు నచ్చినట్టు నేను పిహెచ్.డి. చేయాలి. ఇక మా మేనమామ గారు ఆయనకు పరిచయమున్న వ్యక్తితో మాట్లాడి పిహెచ్.డి. లో పార్టైంగా చేర్పించాలని నిర్ణయించుకున్నారు.

పిహెచ్.డి. చేరే ముందు నాకు కాబోయే గైడ్ మరియు ఇద్దరు ప్రొఫేసర్లు ఐ.ఐ.ఐ.టి. హైదరబాదులో జరిగే మూడు రోజుల వర్క్ షాప్కి వచ్చారు. అక్కడే నాకు కాబోయే గైడ్ ని కలిశాను. ఆ ఇద్దరు ప్రొఫేసర్లు ఒక ప్రొఫేసర్ గారితో నా గురించి నాకు కాబోయే గైడ్ గారు ఆ ప్రొఫేసర్తో పరిచయం చేసారు. ఆ సార్తో మంచి పరిచయాలు ఏర్పడ్డాయి మరి ఈయనే నాకు ఎక్స్టర్నల్ గా పెడదామని కాబోయే గైడ్ నిర్ణయించుకున్నారు. ఆయన నాతో ఒక ఫ్రెండ్లా ఉండేవారు. అప్పుడు నేను అనుకునేవాడిని పరిచయొస్తుడైన గైడ్ మరియు ఫ్రెండ్లీగా ఉండే ఎక్స్టర్నల్ ఇక ఇబ్బంధి లేకుండా పిహెచ్.డి. సాగిపోతుందని ఉత్సాహంగా ఆ రోజు గురించి ఎదురుచూశా.

ఆ రోజు రానే వచ్చింది అప్పుడు ఆ సార్ క్లిస్టమైన ప్రశ్నలు వేయకుండా పిహెచ్.డి. చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు అలాగే చదవవలసిన సబ్జెక్లను కూడా నిర్ణయించారు. ఇది

జరిగిన తరువాత నేను ఇంటికి వెళ్ళిపోయా. మొదటవ సంవత్సరం పిహెచ్.డి. చదివేటప్పుడు నేను విశాఖపట్టణంలో ఒక కాలేజిలో ఉపాధ్యాయుడిగా పని చేశా.

అక్కడ పాఠాలు చేప్పేటప్పుడే నాకు చాలా సందేహాలు వచ్చేవి. అప్పుడు నాకు వచ్చిన సందేహాన్ని పిల్లలకు తెలుసుకొని రమ్మని చెప్పేవాడిని. ఇలా చేస్తున్నారని పిల్లలు కంప్లైంట్ ఇచ్చారని నాకు తెలిసింది. రెండవ సంవత్సరం అదే సెక్షన్ కు నెను వేరే సబ్జెక్ట్ తీసుకుంటాను అని చెప్పాను పోయిన సంవత్సరంలో పాఠాలు సరిగ్గా చెప్పలేదని. ఈ సారి క్లాస్లు ప్రారంభించిన నెలకే నా మీద కంప్లైంట్ ఇచ్చారు. ఆ సబ్జెక్ట్ ఇంకొక ఉపాధ్యాయుడికి ఇచ్చి నన్ను ల్యాబ్ చూసుకోండి అన్నారు.

అక్కడ ఉండే HOD మంచి వారు కాబట్టి ఉద్యోగం నుండి పీకకుండా నా వర్క్ లోడ్ను తగ్గినట్టు చూయించకుండా

ల్యాబ్లలో మూడవ ఉపాధ్యాయుడిగా ఉండేటట్టు నాకు పని చూసుకో అన్నారు. అక్కడే నాకు స్పష్టంగా అర్థమైనాకూడ నేనెందుకు Ph.D. లో చేరానో ఇప్పటికి వరకు అర్థంకావట్లేదు. మొదటి సంవత్సరం పరిశోధనలో ఎంచుకున్న సబ్జెక్టను చదివి పాస్ అయిపోయా. దీనికి వారు ముఖ్యమైన ప్రశ్నలు ఇవ్వమని అడిగి తీసుకున్నాను. వాటికి జవాబులు పెత్తుక్కోవడానికి చాల ఇబ్బంది పడ్డా. అవి చదివినా అర్థమైయ్యేవికావు. అలాగే అవి వ్రాసి-వ్రాసి మెదడులో ఉండేటట్టు చేసుకొని ఆ తరువాత అన్ని సబ్జెక్ట్లు వ్రాసి పాస్ అయిపోయా.

***

## 4. రెండవ సంవత్సరం

నేను పూర్తిగా పరిశోధన చేయలేక పోతున్నానని మా గైడ్ కల్కత్తాలో తన ప్రైవేట్ ఆఫీసులో ఉంటూ చదువుకో అన్నాడని మా మేనమామ చెప్పారు. ఇక మా అమ్మా నాన్నకు చాలా నచ్చ చెప్పాల్సొచ్చింది. ఒక్కడే కొడుకు ఉండటం వలన ఇళ్ళు వదిలిపోవడం వారికి ఏ మాత్రం ఇష్టంలేదు. ఇక ఉద్యోగానికి రాజీనామాను ఇచ్చేసి కలకత్తాకు బయలుదేరా. నేను నెలకు ఒకసారి లేకుంటే రెండు నెలలకు ఒకసారి ఇంటికి వచ్చేవాడిని. నాకు చదువు మీద అంత ధ్యాస ఉండేది కాదు. అయినా కూడా ఎందుకు ఒప్పుకున్నానంటే గైడ్ వచ్చేసి మన తెలుగాయన. నా గైడ్ ఐ.ఐ.టి. ఖరగ్పూర్లో పిహెచ్.డి. చేశారు మరియు చాలా సంవత్సరాలు సైంటిస్ట్ గా కూడా పనిచేశారు. ఇంతకంటే పెద్ద అదృష్టమేముంటుంది మనకు వచ్చిన డౌట్స్ దగ్గరుండి నేర్పిస్తారని ఉత్సాహంగా-సంతోషంగా-సరదాగా చదువు

అయిపోతుందని అనుకున్నా. నాకు ఇక ప్రతి రోజు పాఠాలు చదువుకొని పిల్లలకు ఎలా చెబితే వాళ్ళకి అర్థమౌతుందని కంగారు పడాల్సిన అవసరములేదు. నేను ఇక రెక్కలొచ్చిన పక్షిలా నాకు ఇష్టమొచ్చినట్టుగా ఉండేవాన్ని. నాతో పాటు ఇంకొకతను ఉండేవారు ఆయన లెక్కలలో చాలా మేధావి ఆయన చాలా మంచి మంచి విషయాలు చెప్పడం మరియు నాకు అవసరమైయ్యే పనులు చెప్పి దాని ద్వారా ఆయన పనులు కూడా చేయించుకునేవారు. అక్కడికి ఇంకొక ప్రొఫెసర్ కూడా వచ్చేవారు ఆయన వారికి సంబంధించిన ప్రాజెక్ట్ పని అక్కడ చేసేవారు దీనికి సహాయం కోసం బెంగాల్లో ఆయన దగ్గర బి.టెక్. చదువుకున్న విద్యార్థి అక్కడ వచ్చి పని చేసేవాడు. ఇది ఇలా ఉన్నప్పుడూ ఎం.టెక్. విద్యార్థి వచ్చేవాడు అతను ఏదో డౌట్స్ ఉంటే నాతో ఉండే వ్యక్తి దగ్గర అడిగేవాడు తరువాత అతనిక్కూడా ఇతనికి తెలిసినవి నేర్పేవాడు. ఇక్కడ అందరూ

చదువుకునే వాళ్ళే నాకు నేర్చుకోవాలని ఆసక్తి ఉండేది కాదు. అందుకే నాకు ఒకలాంటి నిరాశ. అనౌసరంగా వచ్చి ఇరుక్కున్నానా అనిపించేది. సాయంత్రమైతే దగ్గర ఉన్న పార్క్కు వెళ్ళడం అందరితో పాటు వాకింగ్ మరియు జాగింగ్ చేయటం కాసేపటికి రెండు రూములున్న చిన్న ఆఫీసుకు వెళ్ళిపోవడం. నా గైడ్ ఆ ఆఫీసు వచ్చేసి పరిశోదన చేసుకునేవాళ్ళకి మరియు కాలేజి విద్యార్థులకు ఏదైనా నేర్చుకోవాలనుకుంటే ఇక్కడికి వస్తారు అని చెప్పేవారు.

ఇంత హై ప్రొఫైల్ ఉన్న వ్యక్తి దగ్గర పిహెచ్.డి. చేయడం ఎంత మంచి అవకాశము. కాని నేను అది సద్వినియోగం చేసుకోలేదు. ఆయన చెప్పేవి నాకు అర్థమైతాయా అని ఆలోచించేవాడిని. ఆ రెండు గదులలోనే ఉండటం ఏదో నచ్చిన పని చేసుకోవడం తరువాత నిద్ర వస్తే పడుకోవడం చేసే వాన్ని. ఎవరైనా సమయాన్ని వృధా చేస్తారా అంటే నన్ను ఒక మంచి

ఉదాహరణగా తీసుకోవచ్చు. నచ్చిన పనిని ఎంత కష్టమైన చేయొచ్చు కాని మనస్సుకు నచ్చని పనిని మరియు ఇష్టం లేని పనిని చేయడం చాలా కష్టం. నా గైడ్ నన్ను ఎంతో ప్రోత్సాహించేవారు కాని నేను అది అలుసుగా తీసుకొని నా జీవితంలోని అమృత ఘడియలను కోల్పోయాను. నేను తప్పుడు నిర్ణయం తీసుకున్నానని నాకు ప్రతిరోజు తెలిసేది. కాని ఎవరితో చెప్పను. చెప్పినా అందరూ ధైర్యం చెప్పేవారే కాని నన్ను సముద్రము నుండి బయటకు తీసి ఒడ్డుకి చేర్చేదెవ్వరు? మేము ఉన్న గది కిరాయి ఊహించని స్థాయికి పెంచబోతున్నాడని తెలిసి నా గైడ్ ఆయనకు ఉన్న సొంతం ఇల్లు ఖాళీగా ఉంది అక్కడ ఉండి మూడు భాగాల్లో ఒక్క భాగం మీరు ఉండి మిగతా రెండు భాగాలు కిరాయికి ఇద్దాము అని అన్నాడు. ఆ ఇంటి చుట్టూ ఫ్యామిలీలు ఉండే సరికి మాకు ఏ ఇబ్బంది కలగలేదు. నాతో ఉన్న వ్యక్తి నన్ను ఏదో చేయి ఏదైనా

చదువుకో అని అస్తమానం చెప్పేవాడు. నేను మాత్రం అస్తమానం సినిమా చూసేవాడిని. మా గైడ్ మంచిగా చదుకోవాలని ఇంటర్నెట్ పెట్టించారు. నేను దానిని దురుపయోగం చేయడం తప్పా ఎప్పటికీ సద్వినియోగం చేసుకోలేదు. అంత గొప్ప వ్యక్తి దగ్గర పరిశోధన చెయ్యడమే అందరు అదృష్టమని భావిస్తారు. కాని నేను ఆయనకు చెడ్డ పేరుని తెచ్చాను. కొన్ని రోజుల తరువాత నాకు తెలిసిందేమిటంటే నా గైడ్ దగ్గర చదివిన స్టూడెంట్ నా గైడ్ దగ్గర పరిశోధన చెయ్యాలని దరఖాస్తు చేసుకున్నాడు ఆ అబ్బాయి కూడా నా టాపిక్ మీదనే ఎం.టెక్. లో ప్రాజెక్ట్ చేశాడు. నేను ఆ అబ్బాయికి అన్యాయం చేశాను. లేకుంటే ఆ అబ్బాయి పరిశోధన చేసి తన భవిష్యత్తును మరియు దేశ భవిష్యత్తును తప్పకుండా మెరుగు పరిచేవాడు. అతని వళ్ళ నా గైడ్ కూడా సంతోషపడే వారు. నాలాంటి స్వభావమున్న వ్యక్తులు

అందరితో మంచిగా ఉండి వారికే పెన్నుపోటు పొడుస్తాను. నా వళ్ళ నా గైడ్కు ఏ ఉపయోగం లేదు కాని ఆయన అనుభవంతో ఆయన నన్ను మెల్ల మెల్లగా కోలుకునేవిధంగా చేస్తున్నారు కాని నేను ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టు ఉన్నాను. ఆ ఖాళీ ఉన్న ఇంటి నుండి మెయిన్ రోడ్డు పెళ్ళాళంటే ఒక్క కి.మీ. నడవాలి. నేను సరదాగ హెడ్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వినుకుంటూ వాకింగ్ కి పెళ్ళినట్టు జాలీగా పెళ్ళే వాడిని. నేను అక్కడ ఉన్న ఒక సంవత్సరం నా గైడ్ కిరాయికూడా అడగలేదు ఆయనది చాలా జాలి గుణం మరియు కరుణామయుడు. అక్కడ మా గైడ్ వారానికి నాల్గు సార్లు వచ్చేవాడు. వచ్చినప్పుడు అందరిముందూ నన్ను "Where is the output" అని అడిగిన తరువాత హ హ... "No output" అని ఎటకారంగా నవ్వేవాడు. నాకు పీకల వరకు కోపం వచ్చేది. అలా ఆయన నన్ను ఎందుకు అవమానించారో నాకు తరువాత

అర్థమైంది. కొంత మంది విద్యార్థులకు అందరి ముందు ఇలా మాట్లాడితే రోషం పొంచుకొచ్చి కష్టపడి చదవడానికి ఇష్టపడతారు. ఆయన చాలా అనుభవం ఉన్న వ్యక్తి కాబట్టి. ఆయన నన్ను ఒక్కొక్క పద్ధతిలో నా స్వభావాన్ని తెలుసుకొని నన్ను ఒక బాధ్యత గల పౌరుడిలా మార్చాలనుకున్నారు.

ఇక సబ్జెక్ట్లు పాస్ అయిన తరువాత కాంప్రెహెన్సివ్ ఎక్సాం వ్రాయాలి తరువాత డాక్టరల్ కమిటీ ముందు మనం ఏమి చేయబోతున్నామో వివరించాలి. ఇందులో హైదరాబాద్లో కలిసిన ప్రొఫెసర్ గారు ప్రొసీడ్ కావచ్చు అని అప్రూవల్ ఇచ్చారు. ఆ రోజు ఇంకొక సంఘటన జరిగిందని, నాకు ఒక సంవత్సరం తరువాత తెలిసింది. అదేమిటంటే ఒకే రోజు ఇద్దరికి నా గైడ్ ఆయనతో మీటింగ్ పెట్టించడంతో కాలేజి వారు ఒకరికే డబ్బులు ఇచ్చారు. అది కాకుండా ఆ డబ్బు ఇవ్వడానికి ఆయన్ను చాలా సేపు వేచి ఉండమన్నారు. డబ్బు తక్కువ ఇచ్చినా

పట్టించుకోరు, ఆయన్ను వేచి ఉండమనటం ఆయనను అవమానించినట్టే అది ఎవరుకూడా ఎందుకు సహిస్తారు. ఆయనకు మనస్సు కష్టపడటం వలనా ఆయన ఇంకొక్కసారి మా కాలేజికి రానని చెప్పారు. ఈ విషయం తెలిసిన తరువాత నా గైడ్ చాలా బాధ పడ్డారు. నా గైడ్ కు గవర్నమెంట్ ఇచ్చే పెన్షన్ చాలా ఎక్కువే వస్తుంది. అది తీసుకొని ఇంట్లో ఆయన దర్జాగా బ్రతకవచ్చు కాని ఆయన తనకున్న తెలివితెటలు అక్కడితో ఆగిపోకూడదు. చదువుకి వయస్సుతో పనిలేదని చెప్పి ఆయన అందరికి సహాయం మాత్రమే చేయడం కాకుండా ఆయనకు ఉన్న అనుభవముతో ఎంతో మంది పరిశోధకులకు మార్గదర్శుడయ్యారు.

నేను కాలేజీకి దూరంగా ఉంటూ చదవడము, ఇంట్లో ఉండీ చదవడమూ రెండు ఒకటే అని అనిపించి. కాలేజి హాస్టల్లో చేరాను. కాలేజికి హాస్టల్కి ఎక్కువ దూరం ఉండేది కాదు. ఆ

తరువాత గైడ్ అతని ఇంటికి కిరాయకు ఇవ్వడానికి ఇంటర్నెట్లో పెట్టమన్నాడు. సరే అని నేను పెట్టాను. ఇక ఫోన్ల మీద ఫోన్లు వచ్చీ రాని బెంగాలి భాషలో మాట్లాడి బుర్ర వేడెక్కి పోయేది. కాని నా గైడ్ కు కొద్దిగో గొప్పో ఉడతా భక్తి సహాయం చేశాను. నన్ను ప్రతి శని ఆదివారాలు ఆ ఖాళీ చేసిన ఇంట్లో ఉండి ఇళ్ళు చూయించు అని నాకు సహాయం చేయి అని అడిగారు. అంత గొప్ప వ్యక్తి నా సహాయం కోరడమేంటి, పోయిన జన్మలో నేను చేసుకున్న పుణ్యమై ఉంటుందని భావించాను. ఆయన పని నేను చేస్తుంటే నాతో ఉండే పరిశోధకులకు మండి పోయేది. ఎందుకంటే వారికి ఆ అదృష్టం రాలేదు కాబట్టి. నీకు కష్టపెట్టించాలంటే మనస్సు ఒప్పుకోవట్లేదయ్యా కాని తప్పేలా లేదు అని అన్నారు. దానికి బదులుగా సార్ ఈ అవకశాము నాకు ఇవ్వాలి అని అక్కడ గొడవపడుతున్నారు. మీరు

నాకిచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అంటే. ఆయన ఒక చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయారు.

***

# 5. మూడవ సంవత్సరం

నా గైడ్ అయితే రెండు సంవత్సరాలు. ఈ టాపిక్ మీద పరిశోధన చేయి అని చెప్పేవారు. అందులో చేస్తుంటే ఓ ఆరు నెలల తరువాత ఇలా చేస్తే బాగుంటుంది అని చెప్పి ఆయనకు నచ్చిన విధంగా "తోలు బొమ్మలాట లాగా" నన్ను ఆడించాడు అని అనుకున్నాను కాని ఏది ఎంత సేపు చదవాలి దేనికి ఎంత సమయం వెచ్చించాలి ఆయనకంటే మంచిగా ఎవరు చెప్పగలరు చెప్పండి. అందుకే చదివిందే పది సార్లు చదివేకంటే. చదివినదాన్ని ఒక్క సారి అర్థం చేసుకోవడం ముఖ్యమైనదని చెప్పారు. ఒక రోజు నా గైడ్ నన్ను పిలిపించాడు ఏమి చెబుతారో అని వెళ్ళాను. అప్పుడు ఆయన డైరీ తీసి పేజి పై భాగంలో నా పేరు పెద్ద అక్షరాలతో వ్రాసి. నా పిహెచ్.డి. ప్లాన్ చెప్పడం మొదలెట్టారు. ఆయన చెప్పిన పది నిమిషాలు నాకు కొద్దిగ ఊరట నిచ్చేది.

ఆయన పిహెచ్.డి. ముగించడానికి ఏమేమి చేయాలి అని చూడ ముచ్చటగా చెప్పేవారు.

1. నీవు ఇప్పుడు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్నావు.

2. మొదటి సంవత్సరములో ఒక సమావేశానికి (Conference) కి వెళ్ళి వచ్చావు.

3. నీకు ఇంకొక్క (Conference) పేపర్ కావాలి అది నువ్వు పూర్తి చెయ్యాలి. ఆయన నాకు ఒక్కసారిగా కష్టపెట్టకుండా అంచలంచలుగా నా పనిని అప్పగించేవారు. ఎవరు ఎంత చేయగలరని ఆయనకు బాగా తెలుసు.

ఇది ఇలాగుంటే నాతో పాటు పరిశోధన చేసే వ్యక్తి నాకు ఐ.ఐ.టీ. ఖరగ్పూర్లో తన మిత్రుడు ఇదే టాపిక్ మీద పరిశోధన చేస్తున్నాడని అతని ఫోన్ నంబర్ ఇచ్చాడు. నాకు కొద్దిగ ఊరట లభించింది. ఆ అబ్బాయి ఎలాంటి వాడంటే నేను అక్కడికి వస్తే

అతని ఆస్తి నేను ఎక్కడ లాగేసుకుంటానని అనుకునేవాడు. వాడికి ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తడు. మెసేజ్ చేస్తే బదులివ్వడు. ఈరోజు రమ్మని చెప్పి ఓ గంట అయ్యాక ఫోన్ చేసి సారి నాకు పనుంది రేపు రమ్మంటాడు. ఇలా వీడు చుక్కలు చూయించాడు. రెండు మూడు సార్లు ఎక్కిన బస్సు నుండి మధ్యలో దిగేసి వెనక్కు వెళ్ళిపోయేవాన్ని. చివరకు ఒక సారి అతనితో మాట్లాడినాను తన పరిశోధన గురించి నాకు చెబుతూ వచ్చాడు ఆ తరువాత అతని గైడ్ దగ్గర పిలుచుకొని పోయాడు. ఆయన పేరు చదివినప్పుడు అర్థమైంది ఆయన మన ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వ్యక్తని నాకు అర్థమైంది. కాని ఇక్కడ కూడా నాకు నిరాశే ఎదురైంది. ఆయన చాలా బేసిక్ ప్రశ్నలు వేసి అవి నువ్వు నేర్చుకో అని చెప్పి నన్ను పంపించేశాడు. మనకి ఒక వ్యక్తి మాటల విధానాన్ని విన్న తరువాత ఈయన మనల్ని ఎంతగా మనకు సహాయపడతాడు అని కొద్దిగ అర్థమైపోతుంది.

ఆయన చెప్పిన వాటిలో నేను తప్పు వెతకట్లేదు. అవి చదువుకో అని చెప్పి తరువాత ఏమి చేయాలి అని చెబితే భవిష్యత్తులో ఇది చెయ్యాలి అన్న శైలిలో ముందుకు సాగిపోతుంటాము. తరువాత ఏమి చెయ్యాలో తెలియక పోతే చేసే పనినే మళ్ళీ మళ్ళీ చేస్తుంటాము. నాకు తెలిసిన బేసిక్ నాలెడ్జ్ చాలా తక్కువ. ఆయన నేను బాగుపడాలి అని చెప్పిండొచ్చు. నా అభిప్రాయం ఏమిటంటే ఒక మొద్దు విద్యార్థికి బాగా చదివే విద్యార్థికి ఒకేలా పాఠం చెబితే వాడు ముందుకెల్లగలడా? ఆయనకు నా పరిస్థితి చెప్పిన తరువాత కూడా ఆయన ఆ జవాబు ఇచ్చే సరికి నేను నోరు మూసుకొని తిరిగి నా కాలేజికి వెళ్ళాల్సొచ్చింది.

***

## ౬. ఆపత్బాంధవుడు

ఇలా రెండు సంవత్సరాలు గడిచిన తరువాత మూడవ సంవత్సరంలో నా టాపిక్ మీద పరిశోధన చేసి పి.హెచ్.డి తీసుకున్న వ్యక్తి మా డిపార్ట్మెంట్లో చేరాడు. ఆయన నాకంటే మూడు సంవత్సరాలు చిన్నవాడు కావడంతో నాతో బాగా కలిసిపోయాడు. వచ్చిన అతను నాకు సహాయం చెయ్యాలంటే అతన్ని నా పరిశోధనలో ఆయన పేరు రెండవ వ్యక్తి కింద పెడితే తప్ప వారు శ్రద్ధతో పని చెయ్యరు అంటే అతని పేరు పెట్టడానికి ఒప్పుకున్నారు. ఈయన చెయ్యాల్సిన పనులన్నీ అయిపోజేసి అతనికి కొద్దిగ సమయం దొరికితే నాకు సహాయం చేసేవారు. ఆయన అందరూ వెళ్ళిపోయినా రాత్రి ఎనిమిది గంటల వరకు కాలేజిలో ఉండి కుదిరినప్పుడు నాకు ఎలా చెయ్యాలో సలహ ఇచ్చేవారు. అది చేసిన తరువాత ఆయనకు చూయించి ఆయన చెప్పిన మేరకు మళ్ళీ ప్రయత్నించే వాడిని.

మూడవ సంవత్సరం చివర్లో ఎంతో కష్టపడి ఒక పేపర్ను వ్రాశాను. అది వ్రాయడానికి దాదాపు ఐదు నెలలు పట్టింది అది నాకు ఉన్న స్తోమత. మామూలుగా ఎవరుకూడా ఇంత సమయం తీసుకోరు నాకు ఉన్న ఓపిక సహన శక్తితో ఏదో కొంత వ్రాశాను.

నేను మూడు సంవత్సరాల్లో ఒక పేపరు అతి కష్టం మీద రాస్తే అది IEEE లో రావాలని అందులో వచ్చే విధంగా వ్రాయాలంటే ఇలా ఉండాలి అని చెప్పారు. ఆయన నన్ను నువ్వు చేసింది నీకు అర్థం కావట్లేదంటే అర్థమైయ్యేటట్లు నీకు నేను చెబుతా అని ఆయన నాకు వాటి గురించి చెబుతూ వచ్చారు. ఇది ఒక్కటే కాదు ప్రతి ఒక్కటీ చివరి రోజు నేను అడిగినా ఆయన కొపగిచ్చుకునే వారే కాదు. ఎంత మందికి ఇలా ఓపిక ఉంటుంది చెప్పండి. నేను పరిశోధన తప్ప దిక్కుమాలిన పనులన్నీ చేసే వాడిని. నాకు ఇది తప్పా

మిగిలాది చేతకాదని ముందే తెలిసిపోయింది. కాని ఎందుకనో అర్థమైయ్యేవి కావు. అది ఎందుకో నాకు తెలియదు. అలాగే సమాయాన్ని నెడుతూ వచ్చా.

***

# 7. నాల్గవ సంవత్సరం

ఇక నాలుగో సంవత్సరంలో నేను ఒక పేపర్ను బయటి వారి సహాయంతో చేయించి నేను నేర్చుకొని పేపర్ను అతికష్టం మీద తయారు చేస్తే దానికి ఏవేవో మార్పు చేర్పులు చెప్పి. అవి ఎలా చెయ్యాలో సలహాలిచ్చి ఆ నాలుగో సంవత్సరం ఆ పేపర్ని ఏ జర్నల్కు పంపించాలో చెప్పారు. ఇక నేను తరువాత ఏదో ఒకటి చేసుకుంటూ ముందుకు వెళ్తుండాలని చెప్పి మిగతా అల్గారిథంల మీద ప్రయత్నించసాగాను.

ఆ సంవత్సరం చివరన ప్రాజెక్ట్ ఫండ్ ద్వారా IEEE Conference కి సెలెక్ట్ అయింది అది సెలెక్ట్ కావడానికి కారణం కేవలం నా గైడ్ యొక్క సంపూర్ణ సహకారం. ఇప్పుడు ఈ పేపర్ను అడ్డం పెట్టుకొని నేను ఏదో సాధిస్తున్నానని, మా మేనమామ ఆనందపడేవారు. కాని అక్కడ చేసింది నేను కాదని ఆయనకు తెలియదు. నా ఖర్మకు చిన్నప్పటి నుండి కష్టపడితే

పని జరగదు. ఏద్రైతే-అయింది అని చేస్తే అది సఫలం కావడం నాకు చాలా కోపం వచ్చేది. Conference కి పేపర్ సెలెక్ట్ కావడమనేది సర్వసాధారణ విషయం. కానీ జర్నల్లో పేపర్ సెలెక్ట్ కావడమన్నది మనము చేసిన పరిశోధన మీద ఆధారపడి ఉంటుంది.

నేను చేసిన పరిశోధన ఎలాంటిదో నాకంటే బాగా ఎవరికీ తెలియదు. నా గైడ్ నేను చేసిన పరిశోధన అంత పనికొచ్చే విధంగా లేకున్నా కూడా నన్ను ప్రోత్సహిస్తూ. నా ప్రయత్నాన్ని కొనసాగించన్నారు. కాని నాకు చదువు మీద మరియు పరిశోధన మీద పూర్తిగా ఆసక్తి తగ్గిపోయింది. నాకు నా మీద అసహ్యం వేసేది. అలా మెల్ల మెల్లగా నాకు నా మీద నమ్మకం పోయింది. ఆ తరువాత ప్రతి రోజు ప్రైం వీడియోలో సినిమాలు చూడటం, గేంస్ ఆడటం. అలా అమూల్యమైన సమయాన్ని నా చేతులార వృధా చేస్తూ వచ్చాను. నాలో ఉండే సోమరితనం,

పరిశోధన మీద సరైన అవగాహన లేకుండా అందులో అడుగుపెట్టడం. ఆ తరువాత అందరిని ఇబ్బంది పెట్టడం తప్ప నేనేమీ చేయలేదు.

***

## 8. ఐదవ సంవత్సరం

ఇన్ని సంవత్సరాలు అందరి నోట విన్నది ఒకటేమాట: తొందరగా అయిపోగొట్టుకొని వెళ్ళిపోండి. నేను వ్రాసిన పేపర్ను డబ్బులిచ్చి ఏదో ఒక జర్నల్లో పబ్లిష్ చేస్తే తొందరగా బయట పడొచ్చని అనుకున్నాను కాని నా మనస్సు సహకరించలేదు.

ఇక్కడ కళ్ళకు గంతులు కట్టేసి నడి సముద్రములో వదిలేసినట్టు ఉంది నా పిహెచ్.డి. ప్రయాణం. చూద్దామన్నా కనిపించదు, నీటి శబ్ధం తప్పా ఏమి వినిపించదు. క్షణ-క్షణం భయం భయం. నేను సిగ్గు-లజ్జ రెండూ వదిలేసి పిహెచ్.డి. చేస్తున్నాను.

ఇలా కొన్ని రోజులు గడిచాక నా మేనమామకు నేను ఇక పిహెచ్.డి. చెయ్యను అని నా నిర్ణయాన్ని తెల్చి చెప్పేసా. నన్ను నేను మూర్ఖున్ని చేసుకుంటూ మరియు మిమ్మలని మూర్ఖుడిని చేస్తూ నేను ఉండలేను అని ఏడ్చి చెప్పాను.

ఇప్పటి వరకు మీ డబ్బు మరియు నా సమయాన్ని వృధా చేసింది చాలు ఇకపై నాకు ఫ్రీగా పిహెచ్.డి. ఇచ్చినా నాకు వద్దు అని మా మేనమామకు చెప్పేసరికి ఆయన సరే నీవు విశాఖపట్టణానికి వచ్చేసేయ్ నీకు నచ్చిన విధంగా నువ్వు చేద్దువుగాని అని చెప్పారు. నేను నా గైడ్ ను నాకు ఈ పిహెచ్.డి. వద్దు సార్, నాకు అంత తెలివిలేదు నేను ఈ పిహెచ్.డి. తీసుకొని వేరే విద్యార్థుల జీవితాలను నాశనం చేయదలచుకోలేదు సార్ అని చెప్పాను. అతను నువ్వు పిహెచ్.డి. తీసుకున్న తరువాత వేరే ఉద్యోగం చూసుకో అన్నాడు. నేను ఆయనను బతిమిలాడి సార్ మీరు అనుకుంటే నా పిహెచ్.డి. ని విథ్ డ్రా చేయగలరు. నన్ను సంతోషంగా వెళ్ళనివ్వండి నేను మా అమ్మా-నాన్న దగ్గర ఉండి వారిని చూసుకుంటాను అని చెప్పాను. ఆయన నన్ను ఇంటికి వెళ్ళి ఒక నెల తరువాత రావో అప్పుడు ఆలోచిద్దామన్నాడు. నేను

ఆయనను ఇంతకంటే కష్టపెట్టకూడదని చెప్పి సరే సార్ అని అన్నాను. ఇంటికి వెళ్ళిపోయి నాలుగు నెలలైనా తిరిగి కలకత్తాకు పోలేదు ఆయన ఫోన్ చేసిన ప్రతిసారి ఇంట్లో నా అవసరం ఉంది సార్ సమయం చూసుకొని వస్తాను అని చెప్పి అలా కాలాన్ని గడిపేస్తున్నాను. నేను నా మొండి పట్టుని వదలకుండా ఉన్నాను. నా గైడే నన్ను పిలిపించి నా పిహెచ్.డి. ని విథ్ డ్రా చేసి నా సర్టిఫికేట్లు ఇప్పిస్తే సరి లేకపోతే వారే పెట్టుకోని. విసిగెత్తిపోయి వారే నాకు కొన్ని నెలలలో మెయిల్ పెట్టి రప్పిస్తారు. డబ్బు సెటిల్మెంట్ మరియు సర్టిఫికేట్లు ఇచ్చేస్తారు అనుకున్నా.  చివరకు నన్ను నా భవిష్యత్తు బాగుండాలని నాకు ఏ ఇబ్బంది లేకుండా వేరే మార్గము చూయించారు నా గైడ్. ఇలాంటి మంచి గైడ్ అందరికి దొరకరు. తరువాత నాకు నా గైడ్ ఒక మెయిల్ పెట్టారు. పరిశోధన నీ లక్ష్యం కానప్పుడు నీకు నీ జీవితంలో వేరే లక్ష్యం ఉంటుంది

అదేంటో తెలుసుకో అని చెప్పి పదిహేను రోజుల్లో నా పి.హెచ్.డి విథ్ డ్రా అయినట్టు నాకు డైరెక్టర్ రిసర్చ్ నుండి మెయిల్ వచ్చింది మరియు నా సర్టిఫికేట్లు నాకు కొరియర్ చేశారు.

***

## నా మాట

మనము ఏ పని చేసిన కాని అది మనకి ఆనందాన్ని ఇస్తుందా? సంతోషాన్ని ఇస్తుందా? డబ్బు ఇస్తుందా? భవిష్యత్తును ఇస్తుందా? గౌరవాన్ని ఇస్తుందా? ఇలా అనేక వాటి మీద ఏమి ఇస్తుందని ఆలోచించవచ్చు కానీ. మనము చేశే వృత్తికి ఎంత న్యాయం చేస్తున్నాము. పూర్తి న్యాయం చేయక పోయినా. మన వృత్తి లోపం వళ్ళ ఎవరికి నష్టం జరుగుతుంది అది ఆలోచించండి.

ఉదా: ఒక ఇంజినీర్లో వృత్తి లోపం వళ్ళ ఒక వస్తువు పాడు కావచ్చు. ఒక మనిషికి తీవ్ర గాయాలు కావచ్చు, ఎంతో మంది చనిపోవచ్చు ఇలా ఇంకెన్నో ఉన్నాయి. ఒక డాక్టర్ వృత్తి లోపం వల్ల ఒకరికి లేని రోగం రావచ్చు, ప్రాణం పోవచ్చు, ఒక మనిషి అవిటివాడు కావచ్చు, చూపు పోవచ్చు ఇలా ఇంకెన్నో ఉన్నాయి. ఇంకొన్ని వృత్తి లోపం వల్ల తీవ్రంగా నష్ట పోవచ్చు.

రాత్రికి రాత్రే ధనికుడు కాస్తా పేదవాడు కావచ్చు. ఎందులో నేను పని చేయాలి అన్న ప్రశ్న మీకు మీరే వేసుకుంటే.

మీ ముందు ఈ ఆప్షన్లు ఉంటాయి. ఇంకా ఎక్కువ కూడా ఉండొచ్చు. అందులో నేను ఈ మూడిటిని ఎంచుకున్నాను:

1. ముందు మీకు నచ్చింది చేయడం.

2. మీరు ఎందులో నిష్ణాతులు కాగలరో అందులో మీరు పని చేయడం.

3. మీ కుటుంబం పరిస్థితి ప్రకారం మీరు పని చేయడం. ఎంతో మంది ముందుగా ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోతారు ఆ తరువాత ఇంకొక దాంట్లో మంచిగా రాణిస్తారు.

మీరు గూగుల్ లో ***"Inspiring People Who Completely Changed Their Careers"*** అని వెతకండి. అప్పుడు మీకే అర్థమౌతుంది. మీకు నచ్చిన వ్యక్తులు వారి నిజ జీవితంలో ఏమి చేశారన్న వాస్తవాలు మీ ముందుంటాయి.

మీరు Ph.D. చేయాలంటే మనకి ఎలాంటి గుణాలు ఉండాలి. ఎలా Ph.D. చెయ్యాలి మొదలైనవి. దీని తరువాత రాబోయే పుస్తకం "Ph.D. చేస్తారా?" అందులో చదవండి.

జీవితంలో గెలుస్తూ ముందుకు వెళ్ళేవాడి కంటే. గెలవడానికి పూర్తిగా ప్రయత్నించి ఓడిపోయిన వాడికే అందులోని లోటు-బాట్లు మరియు ఇక్కట్లు ఎక్కువగా తెలిసి ఉంటాయని నేను నమ్ముతాను.

*****